నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, సోమవారం 17 జూన్ 2024 | VIKARABAD

బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కలెక్టర్ ప్రతీక్‌జైన్

కలెక్టర్‌గా ప్రతీక్‌జైన్ బాధ్యతల స్వీకరణ

వికారాబాద్, జూన్ 16 : వికారాబాద్ నూతన కలెక్టర్‌గా ప్రతీక్‌జైన్ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో ఇప్పటివరకు పనిచేసి బదిలీపై వెళ్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి నుంచి ఆయన నూతన కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారు లు, నాయకులు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లా అభ్యున్నతికి కృషి చేస్తాన న్నారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తున్న తనకు కలెక్టర్‌గా పదో న్నతి కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీలకు ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీవోలు వాసుచంద్ర, శ్రీనివాసులు, అన్ని శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కిడ్నాప్ చేయించింది.. బావమరిదే..

బావతో 'ఆర్థిక' గొడవలు

కేసును ఛేదించిన గచ్చిబౌలి పోలీసులు

ఇద్దరు నిందితులు అరెస్టు... పరారీలో 10 మంది

శేరిలింగంపల్లి, జూన్ 16: ఆర్థిక లావాదేవీల్లో తేడాలు రావడంతో వరుసకు బావను కిరాయి ముఠాతో కలిసి కిడ్నాప్ చేయించాడు బావమరిది. ఈ కేసు ఛేదించిన గచ్చిబౌలి పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కిడ్నాప్‌నకు పాల్పడిన మరో 10 మంది పరారీలో ఉన్నారు. కలకలం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కేపీహెచ్‌బీ కాలనీలో నివసించే సత్తనపల్లికి చెందిన చదలవాడ సాయిగుప్తా (35), నిజాంపేటకు చెందిన కర్రె సతీశ్‌రెడ్డి(38) వ్యాపార భాగస్వాములు. చదలవాడ సాయిగుప్తాకు బావమరిది వరుసైన సత్తెనపల్లికి చెందిన భవిశెట్టి గౌతమ్(35) అధిక వడ్డీకి అప్పు ఇచ్చాడు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇచ్చిన అప్పునకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కిడ్నాప్ చేసి డాక్యుమెంట్లు రాయించుకోవాలని గౌతమ్ భావించాడు. ఈ క్రమంలో అల్విన్‌కాలనీలో నివాసముండే సత్తెనపల్లికి చెందిన అన్నం అశోక్‌రెడ్డిని కలిశాడు. ఇద్దరు కలిసి జగద్గిరిగుట్టకు చెందిన కిరాయి ముఠాతో కిడ్నాప్‌నకు పథకం రచించారు. ఈనెల 14న రాత్రి గచ్చిబౌలిలోని పీఎస్ఆర్ ప్రైమ్ టవర్స్ నుంచి సాయిగుప్తా, సతీష్‌రెడ్డి కారులో ఇంటికి బయలుదేరారు. మరో కారులో గౌతమ్‌తో పాటు మరో 10 మంది వెంబడించారు. హాఫీజ్‌పేట వరకు చేరుకున్న సాయిగుప్తా, సతీష్ రెడ్డి ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టారు. సాయిగుప్తా, సతీష్ రెడ్డిలను జగద్గిరిగుట్ట ప్రాంతంలోని నిర్మానుష్య ప్రాంతానికి తరలించారు. అప్పు తీసుకున్నట్లు డాక్యుమెంట్లపై సంతకం చేయాలని ఇద్దరిని చితకబాదారు. అనంతరం అక్కడి నుంచి వారిద్దరిని వికారాబాద్ జిల్లాలోని ఓ వ్యవసాయక్షేత్రంలోకి తీసుకెళ్లి తీవ్రంగా హింసించారు. సాయిగుప్తా భార్యకు ఫోన్‌చేసి డబ్బులు డిమాండ్ చేశారు. సాయిగుప్తా భార్య తులసి శనివారం గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేసింది. దీంతో నిందితులు వికారాబాద్‌లో ఉన్నట్లు గుర్తించిన గచ్చిబౌలి పోలీసులు అక్కడకు వెళ్లారు. ఇది గమనించిన దుండగులు సాయిగుప్తా, సతీష్‌రెడ్డిలను అక్కడే వదిలి అక్కడి నుంచి పరారయ్యారు. ప్రధాన నిందితులైన గౌతమ్, అశోక్‌రెడ్డిలను పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. మరో 10 మంది దుండగులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ సరుకులకు ఈ-కేవైసీని తప్పనిసరి చేసిన ప్రభుత్వం

లేదంటే రేషన్ కార్డుల్లో పేర్ల తొలగింపు..

బియ్యం దుర్వినియోగం కాకుండా కేసీఆర్ ప్రభుత్వంలోనే మొదలైన ప్రక్రియ

జిల్లాలో చలామణిలో ఉన్న 5.58లక్షల రేషన్ కార్డులు

బోగస్ ఏరివేత తర్వాతే కొత్త రేషన్ కార్డుల జారీ !

అనేక సంక్షేమ పథకాలకు రేషన్ కార్డును ప్రభుత్వం ప్రామాణికంగా పరిగణిస్తున్నది. బోగస్ కారణంగా రేషన్ బియ్యం సహా ఇతర సరుకులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో అర్హులకే అందేలా ప్రభుత్వం ఈకేవైసీ(ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్)ని తప్పనిసరి చేసింది. ఈకేవైసీ చేయించిన వారికి మాత్రమే రేషన్ సరుకులు అందనున్నాయి. ఈ ప్రక్రియను చేయించుకోనివారి పేర్లను సైతం రేషన్ కార్డుల నుంచి తొలగించనున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రక్రియ మొదలైనప్పటికీ ఇంకా వంద శాతం పూర్తి కాలేదు. రంగారెడ్డి జిల్లాలో ఈకేవైసీని ఇప్పటివరకు 99 శాతం మంది చేయించుకున్నారు. ఈకేవైసీ పూర్తికి సెప్టెంబర్ 30 వరకు గడువును ప్రభుత్వం పొడిగించింది.

- రంగారెడ్డి, జూన్ 16 (నమస్తే తెలంగాణ)

ఈ-కేవైసీ@99 శాతం

జిల్లాలో 5.58లక్షల రేషన్ కార్డులు..

రంగారెడ్డి జిల్లాలో వివిధ రేషన్ కార్డులు 5,58,410 ఉన్నాయి. వీటిలో 18,22,532 మంది సభ్యులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా సివిల్ సప్లయ్ శాఖ 11,559.197మెట్రిక్ టన్నుల బియ్యం కోటాను కేటాయిస్తూ వస్తున్నది. ఒక్కో వ్యక్తి పేరిట ఆరు కిలోల చొప్పున రేషన్ కార్డుల్లోని కుటుంబ సభ్యులందరికీ ప్రభుత్వం నెలనెలా బియ్యాన్ని ఉచితంగా అందజేస్తున్నది. స్థానికంగా లేనివారు, చనిపోయిన వారు, ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పేరిట ప్రతి నెలా బియ్యం పంపిణీ జరుగుతున్నది. ఈ అక్రమాలను అరికట్టేందుకు బయోమెట్రిక్, ఐరిస్ విధానాలను అమలు చేస్తున్నప్పటికీ బోగస్ లబ్ధిదారులను గుర్తించడం కష్టంగా మారింది. దీనికి ప్రధాన కారణం రేషన్ కార్డుల్లోని ఎవరైనా సభ్యుడు ఒకరు డీలర్ వద్దకు వెళ్లి వేలిముద్ర వేస్తే సభ్యులందరికీ బియ్యం పంపిణీ జరుగుతున్నది. దీన్ని ఆసరాగా చేసుకుని అనర్హులు సైతం బియ్యం తీసుకునే పరిస్థితి ఏర్పడింది. ఇలా.. రేషన్ దుకాణాల్లో పొందిన బియ్యాన్ని ప్రైవేటు దళారులకు విక్రయిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో ప్రతి నెలా వేలాది క్వింటాళ్ల బియ్యం దుర్వినియోగమవుతున్నది.

ఈ-కేవైసీతో అడ్డుకట్ట..

రేషన్ కార్డుదారులు ఈకేవైసీని చేయించుకోవడం ప్రభుత్వం తప్పనిసరి చేసింది. రేషన్ కార్డులోని ప్రతి సభ్యుడు రేషన్ దుకాణానికి వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలి. లేకపోతే వారి కోటా బియ్యం రద్దవుతుందని చెప్పడంతో చాలా మంది ఉరుకులు పరుగులు పెట్టి ఈకేవైసీ చేయించుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఈకేవైసీ ప్రక్రియ చివరి దశకు చేరింది. చలామణిలో ఉన్న రేషన్ కార్డుల్లోని 18,22,532 మంది సభ్యులకు గాను గత ఫిబ్రవరి గడువు నాటికి 1,45,088 మంది(92.04 శాతం) ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. మార్చి వరకు మరోసారి గడువు పెంచడంతో అప్పటివరకు 97 శాతం మంది ఈకేవైసీ చేయించుకున్నారు. ప్రస్తుతం 99 శాతం మంది ఈకేవైసీ చేయించుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా ఒక శాతం మంది మిగిలిపోయారు. చిన్నపిల్లలకు సంబంధించి వేలిముద్రలు ఆధార్‌లో అప్‌గ్రేడ్ కాకపోవడం.. కొంతమంది వృద్ధుల వేలిముద్రలను, కంటి పాపలను బయోమెట్రిక్ స్వీకరించకపోవడం వంటి కారణాల వల్ల ఈకేవైసీకి దూరంగా ఉన్నారు. వీరందరి కేవైసీని సైతం చేయించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిసింది.

ఏరివేత తర్వాతే కొత్త రేషన్ కార్డులు !

బోగస్ రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియ పూర్తయిన తర్వాతనే కొత్త కార్డులను జారీ చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం సివిల్ సప్లయ్ అధికారుల వద్ద కొత్త రేషన్ కార్డుల కోసం 71,226 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం మరో 8,398 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించాక.. మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తుల్లో అధికారులు 529 దరఖాస్తులను తిరస్కరించారు. కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వాటిలో 24,796 దరఖాస్తులు సైతం తిరస్కరణకు గురయ్యాయి. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో రేషన్ కార్డుల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. వీటిని ఆన్‌లైన్ చేసి ఉంచారు. ప్రభుత్వం నుంచి మార్గ నిర్దేశాలు వచ్చిన వెంటనే అందుకనుగుణంగా రేషన్ కార్డులను జారీ చేసేందుకు సివిల్ సప్లయ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.

నాణ్యత..నిగ్గుతేల్చేందుకు..

థర్డ్ పార్టీ ఏజెన్సీలతో తనిఖీలు

మూడేండ్ల పనులపై పర్యవేక్షణకు నిర్ణయం

ఏజెన్సీల ఎంపికకు టెండర్లు

సివిల్ ఇంజినీరింగ్ పనులపై దృష్టి

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ పనుల్లో ఏ మేర నాణ్యత ఉందో నిగ్గు తేల్చేందుకు ఏజెన్సీలతో తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు థర్డ్ పార్టీలుగా ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీలు, రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) సంస్థల నుంచి తాజాగా జీహెచ్ఎంసీ టెండర్లు ఆహ్వానించింది. సీఆర్ఎంపీ, ఎస్ఎన్‌డీపీ, హౌసింగ్, పీఎంసీ పనులు మినహా సివిల్ ఇంజినీరింగ్ పనులను ఎంపికయ్యే ఏజెన్సీలు తనిఖీలు చేయనున్నాయి. పనులను నిర్ణీత వ్యవధిలో తనిఖీ చేయాల్సి ఉంటుంది. సిమెంట్, కాంక్రీట్ పుట్‌పాత్‌లు, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, వరద నీటి డ్రైయిన్లు, ఆర్‌సీసీ భవనాలు, కల్వర్టులు, బ్రిడ్జిలు తదితర పనులను పర్యవేక్షించనున్నారు. ఇంజినీరింగ్ విభాగం పనులను 12 ఏజెన్సీలుగా థర్డ్‌పార్టీ నిపుణులు ఎంపిక చేస్తారు. 30 సర్కిళ్లను 12 విభాగాలుగా చేసి.. ఒక్కో ఏజెన్సీకి ఒక్కో విభాగం బాధ్యతలు అప్పగిస్తారు.

పది కిలోమీటర్ల పరిధిలోని ఇంజినీరింగ్ సంస్థల నిపుణులే ఏజెన్సీలుగా టెండర్లలో పాల్గొనాల్సి ఉంటుంది. ఏఐసీటీఈ గుర్తింపు కలిగి ఉండటంతో పాటు ప్రభుత్వ యూనివర్సిటీల్లో సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌కు అనుబంధంగా ఉండాలి.

మూడేండ్లలో జరిగిన పనులు -వాటి విలువ

సంవత్సరం	పనులు	విలువ (రూ.కోట్లు)
2021-22	6456	1835
2022-23	7235	3246
2023-24	6386	1951

12 విభాగాలు -వాటిల్లోని సర్కిళ్లు

- కాప్రా, ఉప్పల్
- హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్
- మలక్‌పేట, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట
- చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్
- మెహిదీపట్నం, కార్వాన్, గోషా మహల్
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్
- యూసుఫ్‌గూడ, చందానగర్
- శేరిలింగంపల్లి , రామచంద్రాపురం-పటాన్‌చెరు
- మూసాపేట, కూకట్‌పల్లి
- కుత్బుల్లాపూర్, గాజులరామారం , అల్వాల్
- ముషీరాబాద్, అంబర్‌పేట
- సికింద్రాబాద్, బేగంపేట

ఎకో పార్కును పట్టించుకోరా...!

6 నెలలుగా ఎక్కడి పనులు అక్కడే

నిరుపయోగంగా కోట్లాది రూపాయల నిధులు

85 ఎకరాల్లో అత్యాధునిక శైలిలో కొత్వాల్‌గూడ ఎకో పార్కు నిర్మాణం

దేశంలోనే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా చేపట్టిన హెచ్ఎండీఏ

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ): కోట్లు వెచ్చించి చేపట్టిన ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అక్షరాలా రూ.300 కోట్లకు పైగా అంచనాతో చేపట్టిన కొత్వాల్‌గూడ ఎకో పార్కు ప్రాజెక్టును ఆరు నెలలుగా పట్టించుకున్న వారే కరువయ్యారు. ఇప్పటి వరకు సుమారు వంద కోట్లకు పైగా ఖర్చు చేసి రకరకాల అభివృద్ధి పనులు చేపట్టారు. ముఖ్యంగా అద్భుతమైన డిజైన్లతో రూపొందించిన ల్యాండ్ స్కేపింగ్, బోర్డు వాక్ పనులు గతేడాది నవంబర్ నాటికే పూర్తి చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కొత్వాల్‌గూడ ఎకో పార్కుకు రాజకీయ గ్రహణం పట్టింది. గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష చేసిన దాఖలాలు లేవు. విశ్వనగరంగా మారుతున్న హైదరాబాద్ మహానగరంలో పర్యాటకానికి పెద్ద పీట వేస్తూ భారత దేశంలో ఇంతకు ముందు ఎక్కడా లేని విధంగా అత్యాధునిక పర్యాటక క్షేత్రాన్ని కొండలు, గుట్టల మధ్య నిర్మించాలని గత కేసీఆర్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. నగరం ప్రతిష్టను పెంపొందించేలా ఔటర్ రింగు రోడ్డు పక్కన అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదు. కోట్లు వెచ్చించి చేపట్టిన ల్యాండ్ స్కేపింగ్‌తో పాటు ఇతర పనులన్నీ నిరుపయోగంగా మారే పరిస్థితి నెలకొన్నది.

దేశంలోనే అతి పెద్ద అక్వేరియం...

ఐటీ కారిడార్, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానం చేసే ఔటర్ రింగురోడ్డును ఆనుకొని ఉన్న సుమారు 85 ఎకరాల విస్తీర్ణంలో కొత్వాల్‌గూడ ఎకో పార్కు నిర్మాణం పనులు చేపట్టారు. ఇందులో ఎంతో ఆకర్షణీయమైన ల్యాండ్‌స్కేపింగ్, గుట్టల మధ్య హాయిగా నడిచేందుకు బోర్డు వాక్‌తో పాటు దేశంలోనే అతి పెద్ద అక్వేరియం, ఏవీయరీ (పక్షి శాల) కేంద్రాల నిర్మాణాన్ని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) చేపట్టింది. శివారు ప్రాంతంలో నగర వాసులకు అద్భుతమైన వినోద కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు గత ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చినా, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టింది. చూస్తుండగానే 6 నెలలు గడిచిపోగా, పార్కులో ఇప్పటివరకు కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన పనులకు ఫలితం లేకుండా పోతోంది. ఎకో పార్కు నిర్మాణ పనులు పూర్తయి ఉంటే.. మహానగరానికి మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా నిలిచే అవకాశముండేది. అలాంటి ప్రాజెక్టును పట్టించుకోక పోవడం అంటే ప్రజా ధనాన్ని వృథా చేయడమేనని పలువురు విమర్శిస్తున్నారు.

నగర శివారు ఉన్న కొత్వాల్‌గూడ పార్కును ఆనుకొని హిమాయత్‌సాగర్ జలాశయం ఏడాది పొడవునా నిండుగా ఉండటంతో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది ఈ జలాశయం చూసేందుకు వచ్చి వెళ్తుంటారు. ఇలాంటి ప్రాంతంలోనే హెచ్ఎండీఏ చేపట్టిన ఎకో పార్కుతో ఎంతో మందికి ఆటవిడుపుగా మారేంది. ప్రభుత్వానికీ ఆదాయవనరుగా ఉండే ఈ ప్రాజెక్టును ఎందుకు పట్టించుకోవడం లేదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొత్వాల్‌గూడ ఎకో పార్కు పనులను పూర్తి చేసి నగర వాసులు సందర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

సమర్థవంతంగా మెట్రో సేవలు

- మెట్రో అధికారుల ముందస్తు కార్యాచరణ సిద్ధం
- నగర ప్రజా రవాణాలో కీలకం.. మెట్రో రైలు

సిటీబ్యూరో, జూన్ 16(నమస్తే తెలంగాణ): మహానగర ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో రైలు అత్యంత కీలకంగా మారింది. రోడ్లపై గంటల తరబడి ట్రాఫిక్ చిక్కులు లేకుండా నిర్ణీత సమయంలో కచ్చితంగా గమ్య స్థానాన్ని చేరుకునేలా ప్రధాన ప్రయాణ సాధనంగా మెట్రో నిలిచింది. ప్రతి రోజూ సుమారు ఐదు లక్షల మంది ప్రయాణం చేస్తున్న మెట్రోను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు మెట్రో అధికారులు ఇటీవల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. మెట్రోలో ప్రయాణించే వారి నమ్మకాన్ని వమ్ము చేయడానికి వారిని గమ్య స్థానాలను చేర్చేందుకు పటిష్టమైన ముందస్తు కార్యాచరణను హైదరాబాద్ మెట్రో అధికారులు సిద్ధం చేశారు. మెట్రో రైళ్లలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించారు. మొత్తం మూడు కారిడార్‌లలో 69 కి.మీ మేర విస్తరించి ఉన్న మెట్రో మార్గాల్లో క్షేత్ర స్థాయిలో వయా డక్ట్‌లను సాంకేతిక నిపుణుల బృందం పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సిద్ధం చేస్తున్నారు. మెట్రో మార్గాల్లో వయా డక్ట్ పక్కనే ఉన్న చెట్లను కత్తిరించడం, విద్యుత్ ట్రాక్షన్ సిస్టమ్ పడే ఇతర వస్తువులను తొలగించడానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

పరిగణనలోకి గత అనుభవాలు..

హైదరాబాద్ నగరంలో మెట్రో సేవలు ప్రారంభమై సుమారు ఆరేండ్లు దాటింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పలుమార్లు మెట్రో సేవలకు అంతరాయం కలిగింది. వీటన్నింటినీ ఒకసారి సమగ్రంగా అధ్యయనం చేసి, అలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా, ఒకవేళ సాంకేతిక సమస్య తలెత్తినా వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసుకోవాలని సూచనలు చేశారు. మెట్రో స్టేషన్లు మొదలుకొని వయా డక్ట్‌ల పొడవునా విద్యుత్ ట్రాక్షన్‌పై పడిన వస్తువులతో కలిగిన ఇబ్బందులు మళ్లీ జరగకుండా చూడాలని, అలాంటి ప్రదేశాలను గుర్తించి, అక్కడ మరోసారి సమగ్రంగా అధ్యయనం చేయనున్నారు. మెట్రో సేవలు ఉదయం ఆరు గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు నిరంతరాయం అందించేందుకు పటిష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లేలా మెట్రో అధికారులు చర్యలు చేపట్టారు. వర్షా కాలంలో నగరంలో రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉండే అవకాశం ఉండటంతో మెట్రోలోనే ప్రయాణించేందుకు నగరవాసులు ఆధారపడతారు. ఈ నేపథ్యంలో మెట్రో సేవల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు ముందస్తు కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని మెట్రో అధికారులు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా..

ప్రస్తుత వర్షా కాలం సీజన్‌లో భారీ వర్షాలు, ఈదురు గాలులు వచ్చే సమయంలో రైలు సేవలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు, విద్యుత్ సరఫరాకు సంబంధించి ట్రాన్స్‌కో నుంచి మెట్రో రైలు నెట్ వర్క్‌లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్ ఫీడర్లకు మార్చడానికి ఉన్న అవకాశాలను గుర్తించనున్నారు. ఇప్పటికే కారిడార్-1లో ఎంజీబీఎస్ వద్ద, మియాపూర్‌లలో విద్యుత్ సబ్ స్టేషన్‌లు ఉన్నాయి. ఈ రెండు సబ్ స్టేషన్లకు ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. ఇక్కడి నుంచి మెట్రో రైలు నెట్ వర్క్ కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎలక్ట్రికల్ విభాగం అధికారులకు మెట్రో అధికారులు పలు సూచనలు చేశారు.